క్లుప్తంగా

దళితుల భూములకు రక్షణ కల్పించాలి



ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదుకు వినతిపత్రం ఇస్తున్న కేవీపీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు రూరల్ మండలం మునగాలపాడు గ్రామ పరిధిలోని కేసీ కేనాల్ కింద దళితులు సాగు చేసుకుంటున్న భూములకు రక్షణ కల్పించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్రా మల్యాద్రి, ఉపాధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాదును కలసి వినతిపత్రం ఇచ్చారు. దళితుల ఆధీనంలోని పొలాలను కొందరు ప్రభుత్వం పేరుతో ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న లలితమ్మ

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలు, వర్కర్లు, హెల్పర్లకు సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ అన్నారు. శనివారం ఎస్టీయూ భవన్‌లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆరో జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడారు. ఐటీయూసీ జిల్లాకార్యదర్శి ఎస్.మునెప్ప, నాయకులు కామేశ్వరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

27న డయల్ యువర్ డీపీటీఓ

కర్నూలు (సిటీ) : ఈనెల 27వ తేదీన డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఏవైనా బస్సు రవాణా సంబంధ సమస్యలుంటే ప్రయాణికులు 9959225787కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) టి.శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నగరపాలకలో ఇద్దరికి పదోన్నతులు



పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలకలో ఇరువురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న పి.సాధిక్ హుస్సేన్, ఎం. రాజులకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పిస్తూ శనివారం నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఉత్తర్వులు అందజేశారు. మరింత నిబద్ధతతో పనిచేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సీనియర్ అసిస్టెంట్ కె. రామక్రిష్ణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సెమినార్‌లో ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాస్

కర్నూలు కల్చరల్: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం ఉర్దూ వర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తమ వర్సిటీ విద్యార్థులు షేక్ సనా సమ్రీన్, షేక్ సల్వా ఫాతిమా పోస్టర్ ప్రదర్శనలో తృతీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ డాక్టర్ జహనారా పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్
ఊరి పేరు భైరవకోన, ఈగల్
క్రాక్ – జీతేగా తో జీయేగా, భ్రమ యుగం
సుందరం మాస్టర్ ,ఆర్టికల్ 370, హనుమాన్

వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్
సిద్ధార్థ్ రాయ్, మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా!
ఊరి పేరు భైరవకోన, సుందరం మాస్టర్
ముఖ్య గమనిక, భ్రమ యుగం

వెంకటేష్ సినీ కాంప్లెక్స్
గుంటూరు కారం, ఊరి పేరు భైరవకోన
భ్రమ యుగం

ఐనాక్స్
క్రాక్ – జీతేగా తో జీయేగా, ఆర్టికల్ 370
డీమన్ స్లేయర్, ఒక్కడు (2003)

రాజ్ : రాజధాని ఫైల్స్
భరత్ కాంప్లెక్స్ : ప్రవీణ్ ఐపీఎస్,
విజయ : భ్రమ యుగం

వలంటీర్లు సంక్షేమ రథసారథులు





ప్రశంసా పత్రాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- కల్లూరు అర్బన్‌లోని వలంటీర్లకు సన్మానం

కర్నూలు (న్యూటౌన్): ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు సంక్షేమ పథకాల రథసారథులని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం కల్లూరు అర్బన్‌లోని నిర్మల్‌నగర్ పార్కులో 16 వార్డులకు సంబంధించి 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న నవరత్నాలను అర్హులందరికీ చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. కరోనా సమయంలో ఎంతో మంది ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. వారి సేవలను గుర్తించి సత్కరించడం గొప్ప విషయమన్నారు. అనంతరం వలంటీర్లకు సేవావజ్ర, సేవామిత్ర పురస్కారాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీఏఏబీ చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి, కల్లూరు సహకార సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, శారద, సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, సాన శ్రీనివాసులు, చిట్టెమ్మ, నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమశంకర్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, కర్నాటి పుల్లారెడ్డి, ధనుంజయ ఆచారి, వీరయ్య, యూనుస్, షరీఫ్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఉపాధి హామీ పథకం అమలు

- సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డికి వివరించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకాన్ని తాము పకడ్బందీగా అమలు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులను కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చెరువులు, కాలువల పూడిక తీత పనులను పూర్తిగా తగ్గించి మిగిలిన పనులను చేపట్టేలా ప్రణాళికలు వేసుకున్నట్లు చెప్పారు. వేసవిలో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రీసర్వేకు సంబంధించి పనులు పురోగతిలో ఉన్నాయని, స్టోన్ ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేస్తామని అందుకు సంబంధించిన నివేదికలు పంపుతామని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, సీపీఓ హిమ ప్రభాకరరాజు, డీఆర్‌డీఏ పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘర్షణలకు తావు లేకుండా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ ఎంఆర్‌ఓ మోహన్, నోడల్ ఆఫీసర్ ఇంతియాజ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యవృత్తిలో సేవే ప్రధానం

కర్నూలు (టౌన్) : వైద్యవృత్తిలో సేవే ప్రధానమని, ఈవిషయాన్ని వైద్యులు గుర్తించుకోవాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని న్యూ లెక్చరర్ హాలులో హౌస్ సర్జన్లతో మెడికల్ కౌన్సిల్ ఎథిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగి వచ్చిన సమయంలో నూతన వైద్యులు జబ్బు గురించి వివరించాలన్నారు. వృత్తిలో ఎన్ని కోట్లు సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎంత మందికి సేవ చేశామన్నదే ముఖ్యమన్నారు. అనంతరం 2 కే 19 బ్యాచ్ హౌస్‌సర్జన్లకు ఎథిక్స్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ చిట్టి నరసమ్మ, డాక్టర్ రేణుకా పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట రంగారెడ్డి

మైక్రో సర్జరీలపై అవగాహన అవసరం

కర్నూలు (టౌన్) : ఈఎన్‌టీ సర్జన్లు మైక్రో సర్జరీలపై నైపుణ్యం పెంచుకోవాలని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ జయప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక నరసింగరావు పేటలోని శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా క్లిష్టతర ఈఎన్‌టీ శస్త్ర చికిత్సలపై నూతన వైద్యులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి 20 మంది నూతన వైద్యులు పాల్గొన్నారన్నారు. ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్లు రమేష్, ఇంద్ర నీల్ రెడ్డి, నథీమ్, ప్రవీణ్, మహేంద్రకుమార్ పాల్కొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలి

కర్నూలు (సిటీ) : ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు శనివారం ఇంటర్మీడియట్ బోర్డు సూపరింటెండెంట్ జానకిరామ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్లు, ఫర్నీచర్ ఉండేలా చూడాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని కేంద్రాల దగ్గర వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు సమయానికి కేంద్రానికి చేరుకునేటట్లు రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు నాగార్జున, పెద్దయ్య, పవన్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో మార్చి 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని అన్నారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగే ఉత్సవాల్లో మార్చి 8వ తేదీ రాత్రి మహా లింగోద్భవం పూజలు వైభవంగా జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. 10వ తేదీన మహా రథోత్సవం ఉంటుందన్నారు. క్షేత్రానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు కట్టుదిట్టం

కర్నూలు సిటీ: వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ థియరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, జిల్లా వృత్తివిద్యాధికారి జమీర్ పాషా అన్నారు. శనివారం టౌన్ మోడల్ కాలేజీలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ సూపరింటెండెంట్లు తదితరులతో పరీక్షల నిర్వహణపై వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని, తాగు నీరు, లైట్లు, ఫ్యాన్లు, డెస్కులు లేకుండా చూసుకోవాలన్నారు. కేంద్రంలోకి ఎలక్ట్రిక్ వస్తువులకు అనుమతించరాదన్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టిస్ జరిగితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించకూడదన్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. సమావేశంలో డీఈసీ సభ్యులు పరమేశ్వరరెడ్డి, లాలెప్ప, ప్రభు చరణ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి

ఈరోజు

పెన్షనర్లకు ఉచిత దంతవైద్య శిబిరం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు పెన్షనర్స్ అసోసియేషన్ కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం ఉచిత మెగా దంతవైద్య శిబిరం నిర్వహించనుంది. వృద్ధాప్యంలో దంతాల పరిరక్షణ లక్ష్యంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లుగా కర్నూలు పెన్షనర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి తెలిపారు. సీ.క్యాంపు సెంటర్‌లోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో జరిగే ఈ శిబిరంలో డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంటాలజిస్ట్ పెన్షనర్ల దంతాలను పరిశీలించి చికిత్స చేస్తారని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'సాక' పరిచయ సభ

కర్నూలు కల్చరల్: కర్నూలు కవులు, రచయితల ఆధ్వర్యంలో 2022– దళిత కథా వార్షిక 'సాక' పరిచయ సభను ఆదివారం ఉదయం 10.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నారు. జంబూ సాహితీ సంపాదకులు డాక్టర్ సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య, కవులు, రచయితలు డాక్టర్ అరుణ, పాణి, వెంకటకృష్ణ, ఇనాయతుల్లా హాజరై ఉపన్యసిస్తారని కార్యక్రమ సమన్వయకర్త జంధ్యాల రఘుబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

శివభక్తుల నిరసన

కర్నూలు కల్చరల్: ఆలయాలకు వెళ్లే భక్తుల నుంచి అటవీ శాఖ అధికారులు పర్యావరణ పరిరక్షణ పేరుతో డబ్బులు వసూలు చేయడం సరికాదని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీశైల శివ దీక్ష అన్న ప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు వద్ద శివ భక్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలానికి వెళ్లే మార్గంలో నాగులు చెక్ పోస్టు వద్ద రూ.200, శ్రీశైలంలో సాక్షి గణపతి, హఠకేశ్వరం క్షేత్రాల వద్ద పార్కింగ్ ఫీజు రూ.50, ఇష్టకామేశ్వరి అమ్మవారిని దర్శించుకోడానికి రూ.1000, రుద్రకోటేశ్వరుని క్షేత్రానికి వెళ్లాలంటే వాహనానికి రూ.300 వసూలు చేస్తున్నారన్నారు. ఇవి కాకుండా శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల నుంచి రూ. 10 చొప్పున తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హరీష్‌బాబు, శివ దీక్ష గురుస్వామి గోవింద రాజు, హిందూ ఎస్సీ ఎస్టీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్, బజరంగ్ దళ్ నాయకులు నీలి నరసింహ, భగీరథ, హరికృష్ణ, సురేష్, ప్రకాష్ సింగ్, బాబు రావు, అయ్యన్న, చంద్ర, వీహెచ్‌పీ నాయకులు గోవింద రాజులు, నాగరాజు, శివ దీక్షా గురుస్వామి రవి, హిందూ చైతన్య వేదిక నాయకులు రాజేష్ శర్మ, బీజేపీ నాయకులు ప్రవీణ్ యాదవ్, గణేష్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సైన్స్‌దే కీలకపాత్ర



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కేడీసీసీ చైర్‌పర్సన్ విజయ మనోహరి

కర్నూలు (సిటీ) : స్థానిక వెంకటరమణ కాలనీలో శ్రీలక్ష్మి హైస్కూల్ ఆవరణలో శనివారం విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి మొదట సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. తర్వాత జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. దేశాభివృద్ధిలో సైన్స్‌దే కీలక పాత్ర అని, ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. కరస్పాండెంట్ వంశీకృష్ణ, హెచ్‌ఎం లక్ష్మి హరిణి తదితరులు పాల్గొన్నారు.

వీఏఏల బదిలీలకు రంగం సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ) బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లా యూనిట్‌గా బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాకు 570 వీఏఏ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 536 మంది వీఏఏలు పని చేస్తున్నారు. అంతర్ జిల్లా బదిలీలతో పాటు జిల్లా పరిధిలో జరిపే ఈ బదిలీల ప్రక్రియను 29లోగా పూర్తి చేయనున్నారు. ఇప్పటికే బదిలీలకు వీఏఏలు దరఖాస్తులు చేసుకున్నారు. మ్యూచువల్, స్పౌజ్ కేసుల విషయంలో అంతర్ జిల్లా బదిలీలు చేపడుతారు. ఉమ్మడి జిల్లా నుంచి 20 మంది ఇతర జిల్లాలకు, ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి 23 మంది రావడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిధిలో ఒంటరి మహిళలు, విడోలు, మెడికల్ గ్రౌండ్స్, స్పౌజ్ విషయాల్లో బదిలీలకు అవకాశం కల్పిస్తున్నారు. ముందుగా ప్రకటించి ప్రకారం అంతర్ జిల్లా బదిలీలు శనివారమే చేపట్టాల్సి ఉండగా.. మధ్యాహ్నం వరకు సాంకేతిక సమస్యల కారణంగా సర్వర్ ఓపెన్ కాలేదు. ఎలాగైనా ఈ నెల 29 నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు.

రాష్ట్ర పునర్నిర్మాణ సభను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నె 26వ తేదీన అనంతపురంలో జరిగే రాష్ట్ర పునర్నిర్మాణసభను జయప్రదం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు షర్మిళ హాజరుకానున్నట్లు చెప్పారు.

ఘనంగా లలితా జయంతి



ప్రత్యేక అలంకారంలో లలితా దేవి అమ్మవారు



విష్ణు సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: మాఘపౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ లలితా అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ పూజ, నవగ్రహ హోమం, లక్ష్మీ గణపతి, మృత్యుంజయ, శ్రీ లలితా దేవి హోమాలు, విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం, భజన కార్యక్రమాలు చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠ దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని అంబా భవాని ఆలయంలో శనివారం వివిధ దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మంటప దేవతా పూజ, దీక్షా హోమం, ప్రధాన దేవతాహోమం, పంచామృతాభిషేకం, యంత్రస్థాపన, బింబ కళాన్యాసం, దేవతా ప్రాణ ప్రతిష్ఠ, ప్రతిష్ఠా హోమం, శాంతి, కుష్మాండబలి, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. గణపతి, సీతారామ లక్ష్మణ, ఆంజనేయ, శివపార్వతులు, నందీశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వాముల వారి విగ్రహ పునఃప్రతిష్ఠ, కుమార స్వామి, దత్తాత్రేయ స్వాముల వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతా మూర్తులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మోహన్‌రావు, నాగప్ప, నాగేంద్ర రావు, బాలాజి, సోము, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

కర్నూలు (సిటీ) : సి.బెళగల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ పెరాలసిస్‌తో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

విద్యార్థులకు అభినందన

కర్నూలు సిటీ: ఏపీ ఉన్నత విద్యా మండలి, వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాబ్ స్కిల్స్‌పై సిల్వర్‌జూబ్లీ కాలేజీలో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సులో పాల్గొన్న విద్యార్థులకు శనివారం అభినందించారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. సర్టిఫికెట్లు ఉపాధి అవకాశాలు పొందేందుకు ఉపయోగపడతాయన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కర్నూలు (సిటీ) : విద్యార్థులు ఉపాధిరంగాల్లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి కె.శామ్యూల్ అన్నారు. ప్రభుత్వ అత్యున్నత విద్య అధ్యయన సంస్థ (ఐఏఎస్‌సీ)లో శనివారం ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాస్థాయి ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారి ప్రారంభించి ప్రసంగించారు. ఎక్స్‌పోలో స్మార్ట్ కంపోజర్ క్రష్ (జెడ్‌ఎస్, చెరుకులపాడు, విద్యార్థి ఎ.రేణుక, బి.వాణి, గైడ్ టీచర్ చాముండేశ్వరి) ప్రథమ స్థానం, మల్టీ ఫంక్షన్ ఫోన్ హోల్డర్ (ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హైస్కూల్, విద్యార్థి వీఎస్ అనంత వాసుదేవ్, గైడ్ టీచర్ సునీల్) ద్వితీయ స్థానం పొందాయి. ఈ రెండు ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఎక్స్‌పోకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎస్‌సీ ప్రిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, ప్రొఫెసర్స్ డాక్టర్ కేవీ మధుసూదన్, మధుసుధాకర్, ఈఎం డీపీ మేనేజర్ గోపాలకృష్ణ, డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.



ద్వితీయ స్థానం పొందిన విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ శామ్యూల్

భారత న్యాయ సంహిత చట్టం వద్దు

కర్నూలు(సెంట్రల్): 2024 జూలై 1 నుంచి భారత న్యాయ సంహిత చట్టాన్ని అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏపీపీటీడీ(ఆర్‌టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ చట్టం అమల్లోకి వస్తే డ్రైవర్లపై కేసులు పెట్టి వేధించే అవకాశం ఉందన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు కల్చరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శనివారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లో బీజేపీ ప్రజా పోరు యాత్రను ప్రారంభించి కర్నూలు మార్కెట్ యార్డులో కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోటి యాదవ్, అధికార ప్రతినిధి గోరంట్ల రామాంజనేయులు, కోశాధికారి లేకేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో-ఫ్యామిలీ కోర్టు, కర్నూలు
F.C.O.S. No. 12/23
S.Shireen .. **Plaintiff**
Vs
Shaik Moulali S/o Shaik Khaleel, H.No. 57/64-E4, Near Pedda Market, Kurnool, Kurnool (Dist) ... **Defendant**
Notice to Defendant
పై నెంబరు దావాలో వాదికి, ప్రతివాదికి 19-03-2004వ తేది జరిగిన వివాహమును రద్దు చేసి విడాకులు ఇప్పించమని మరియు కోర్టు ఖర్చులు కొరకు వాది దావా దాఖలు చేసినది. ఇందులో ప్రతివాది అయిన నీకు అక్షేపణ వున్న 20-03-2024వ తేది పగలు 10.30 గం॥ పై కోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.
కోర్టు వారి ఉత్తర్వు మేరకు
ఎఫ్.జావేద్ ఇమ్రాన్
వాదిపరం అడ్వకేటు, కర్నూలు

పత్రికా ప్రకటన
IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KURNOOL
I.P.No. 06 OF 2024
Between Shaik Mustaq Basha ..Petitioner/Debtor
--Versus--
Shaik Ahmad and others ..Respondents/Creditors
Petitioner: Mr. Shaik Mustaq Basha S/o Shaik Mahaboob Basha, aged about 30 years, R/o, H .No.41-473-8A, Sai Baba Sanjeeva Nagar, Kothapeta, Kurnool (T&M), Kurnool (Dist) - 518004.
Respondents : Shaik Ahmad, S/o Mahammad Saheb, R/o H. No. 41/99 S, Sanjeevaiah Nagar, Kurnool- 518004, Shaik Ghouse Mohiuddin, /o Mahaboob Basha, R/o H. No. 41-473-8, Up stair, Kothapeta, Sanjeevaiah Nagar, Kurnool - 518004, M.D Irfan, S/o Hasav Ahmad, R/o. H. No. 41-572/10, Kothapeta, Kurnool- 518004, Shaik Khairunnisa Begum, D/o Mahaboob Basha, R/o. H. No. 41-473-8, Up stair, Kothapeta, Sanjeevaiah Nagar, Kurnool - 518004, Saif, S/ Shaik Basha, R/o. H. No. 41-473-7, Up stair, Kothapeta, Sanjeevaiah Nagar, Kurnool 518004, Ayeesha, D/o Shaik Basha, R/o. H. No. 41-473-7, Up stair, Kothapeta, Sanjeevaiah Nagar, Kurnool - 518004 and Shaik Farooq Basha, S/o Shaik Arshad Basha, R/o H. No. 89-4376, Balaji Nagar, Kurnool. 518004.
పై అర్జీదారు దివాళా జారీ చేయాలని పై కోర్టు నందు దివాళా కోరు పిటిషన్ నెం. 6/2024 వేసియున్నారు. ఏ దివాళా కోరు పిటిషన్ మీద ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల 01.03.2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమును తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
For M/s Admiral Law Associates
Y. RANDEEP KUMAR REDDY, GAIKWADA BHARATH KUMAR, KARANAM KARTHEEK, Advocates, Kothapeta, Cell: 8886762519.

